

## ఆరోసారి వరల్డ్‌కప్‌కు మెస్సీ

**బ్యూనస్ ఐరీస్, మే 29 :** ఫిఫా వరల్డ్‌కప్ ఫుట్‌బాల్ టోర్నీ కోసం అర్జెంటీనా జట్టును అధికారికంగా ప్రకటించారు. స్టార్ ఫుట్‌బాలర్ లియోనెల్ మెస్సీకి మరోసారి కెప్టెన్ బాధ్యతలు అప్పగించారు. 26 మంది సభ్యులతో కూడిన జట్టును జాతీయ కోచ్ లియోనెల్ స్కాలోని ప్రకటించారు. ఇటీవల తాను వచ్చే వరల్డ్‌కప్‌లో ఆడతానో లేదో తెలియదని మెస్సీ వ్యాఖ్యానించగా.. తాజా జట్టు ప్రకటనతో ఆ సందేహాలకు తెరపడింది. దీంతో మెస్సీ రికార్డు స్థాయిలో ఆరోసారి వరల్డ్‌కప్‌లో బరిలోకి దిగనున్నాడు. ఎనిమిది సార్లు బాలన్ డి ఓర్ అవార్డు గెలిచిన మెస్సీపై మరోసారి జట్టు ఆశలు పెట్టుకుంది. నాలుగేళ్ల క్రితం ఖతార్‌లో జరిగిన వరల్డ్‌కప్‌లో అర్జెంటీనా టైటిల్ గెలిచిన విషయం తెలిసిందే. అయితే ఈసారి జట్టులో రియల్ మాడ్రిడ్ యువ ఆటగాడు ఫ్రాంకో మస్తానటునోకు చోటు దక్కలేదు. జూన్ 11 నుంచి ప్రారంభమయ్యే ఈ మెగా టోర్నీని అమెరికా, కెనడా, మెక్సికో దేశాలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. కన్సాస్ సిటీలో జరిగే తొలి మ్యాచ్‌లో అర్జెంటీనా జట్టు అల్జీరియాతో తలపడనుంది. గోల్‌కీపర్లుగా ఎమిలియానో మార్టినేజ్, జిరోనిమో రుల్లి, జువాన్ ముసోలను ఎంపిక చేశారు. డిఫెండర్ల విభాగంలో గొంజాలో మాంటియెల్, నాహుయెల్ మోలినా, లిసాండ్రో మార్టినేజ్, నికోలస్ ఒటమెండి, క్రిస్టియన్ రొమెరో తదితరులకు చోటు లభించింది. మిడ్‌ఫీల్డర్లుగా రోడ్రిగో డీ పాల్, ఎంజో ఫెర్నాండెజ్, అలెక్సిస్ మాక్ అలిస్టర్, లో సెల్సోలను ఎంపిక చేశారు. అటాకర్ల జాబితాలో మెస్సీతో పాటు జులియన్ అల్వరేజ్, లౌతారో మార్టినేజ్, నికోలస్ గొంజాలెజ్‌లకు స్థానం దక్కింది.



## ఆమె దేశానికి గర్వకారణం..

### వినేశ్ ఫోగట్‌కు సుప్రీంకోర్టులో ఊరట

**న్యూఢిల్లీ, మే 29 :** భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగట్కు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. 2026 ఏషియన్ గేమ్స్ సెలక్షన్ ట్రయల్స్‌లో పాల్గొనేందుకు అత్యున్నత న్యాయస్థానం ఆమెకు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు భారత రెజ్లింగ్ సమాఖ్య దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఈ నెల 30, 31 తేదీల్లో జరగనున్న ట్రయల్స్‌లో వినేశ్ బరిలోకి దిగేందుకు మార్గం సుగమమైంది. వినేశ్ ఫోగట్‌కు ట్రయల్స్‌లో అవకాశం ఇవ్వాలని గతంలో ఢిల్లీ హైకోర్టు తీర్పు ఇచ్చింది. మాతృత్వం కారణంగా ఒక క్రీడాకారిణి వృత్తిపరమైన అవకాశాలను అడ్డుకోవడం సరికాదని హైకోర్టు స్పష్టం చేసింది. అయితే సమాఖ్య నిబంధనల ప్రకారం ఆమెకు అర్హత లేదని పేర్కొంటూ భారత రెజ్లింగ్ సమాఖ్య సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. వినేశ్ ఫోగట్ దేశానికి గర్వకారణమైన క్రీడాకారిణి అని పేర్కొంది. ఇప్పటికే హైకోర్టు తీర్పుతో ఆమె ఆశలు పెరిగాయని, ఇప్పుడు వెనక్కి పంపించడం సమంజసం కాదని వ్యాఖ్యానించింది. అదే సమయంలో క్రీడా వ్యవహారాల్లో హైకోర్టులు అతిగా జోక్యం చేసుకోవడంపై కూడా ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. జాతీయ, అంతర్జాతీయ క్రీడలకు సంబంధించిన అంశాల్లో కోర్టుల జోక్యం వల్ల షెడ్యూల్లు దెబ్బతినే ప్రమాదం ఉందని సూచించింది. ప్రస్తుతానికి వినేశ్ ఫోగట్‌కు తాత్కాలిక ఉపశమనం కల్పించిన సుప్రీంకోర్టు, భారత రెజ్లింగ్ సమాఖ్య దాఖలు చేసిన పిటిషన్‌పై పూర్తి స్థాయి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది. ఈ వ్యవహారంపై సమాధానం ఇవ్వాలని వినేశ్ ఫోగట్‌కు ఆదేశాలు జారీ చేసింది.

# గిల్ సెంచరీ
# ఫైనల్‌లోకి గుజరాత్

- క్వాలిఫైయర్-2లో రాజస్థాన్‌పై ఏడు వికెట్ల తేడాతో విజయం
- 215 పరుగుల భారీ లక్ష్యాన్ని చిత్తు చేసిన టైటాన్స్
- 53 బంతుల్లో 104 పరుగులతో కదం తొక్కిన శుభ్ మన్ గిల్
- అద్భుత హాఫ్ సెంచరీతో రాణించిన సాయి సుదర్శన్ (58)
- వృథా అయిన రాజస్థాన్ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ (96) పోరాటం
- మే 31 ఆదివారం అహ్మదాబాద్ లో ఆర్సీబీ తో బ్లాక్ బస్టర్ ఫైనల్





**ముల్లాన్ పూర్, మే 29:** ఐపీఎల్ లో గుజరాత్ టైటాన్స్ (జీటీ) జైత్రయాత్ర కొనసాగుతోంది. పీసీఏ న్యూ క్రికెట్ స్టేడియంలో జరిగిన క్వాలిఫైయర్-2 మ్యాచ్ లో రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్) పై ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి దర్జాగా ఫైనల్లోకి దూసుకెళ్లింది. 215 పరుగుల భారీ లక్ష్యాన్ని టైటాన్స్ స్టార్ బ్యాటర్ శుభ్ మన్ గిల్ అద్భుత సెంచరీతో సునాయాసంగా ఛేదించి జట్టుకు ఫైనల్ బెర్తును ఖరారు చేశాడు. ఈ విజయంతో మే 31 ఆదివారం అహ్మదాబాద్ లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగే ఫైనల్ పోరులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) తో గుజరాత్ టైటాన్స్ అమీతుమీ తేల్చుకోనుంది. రాజస్థాన్ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ వీరోచిత ఇన్నింగ్స్ ఆడినా ఆ జట్టు బౌలర్లు దారుణంగా విఫలం కావడంతో రాజస్థాన్ కు టోర్నీ నుంచి నిరాశగా నిష్క్రమక తప్పలేదు.

### సూర్యవంశీ సుడిగాలి ఇన్నింగ్స్.. భారీ స్కోరు దిశగా రాజస్థాన్

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన రాజస్థాన్ రాయల్స్ ముందుగా బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత ఇరవై ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 214 పరుగుల భారీ స్కోరు సాధించింది. బరిలోకి దిగిన వైభవ్ సూర్యవంశీ ఆరంభం నుంచే గుజరాత్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కేవలం 47 బంతుల్లోనే 96 పరుగులు చేసి విధ్వంసం సృష్టించిన వైభవ్ తృటిలో సెంచరీ చేజార్చుకున్నాడు. అతడికి తోడుగా సీనియర్ ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా 35 బంతుల్లో 45 పరుగులతో అజేయంగా నిలిచి స్కోరు బోర్డుకు స్థిరత్వాన్ని అందించాడు. ఇక చివర్లో డోనోవన్ ఫెరీరా ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 11 బంతుల్లోనే 38 పరుగులు సాధించి అజేయంగా నిలవడంతో రాజస్థాన్ జట్టు రెండు వందల పరుగుల మార్కును సునాయాసంగా దాటింది. గుజరాత్ బౌలర్లలో జేసన్ హోల్డర్ నాలుగు ఓవర్లలో 27 పరుగులిచ్చి రెండు వికెట్లు తీయగా, కగిసో రబాడ 35 పరుగులిచ్చి రెండు వికెట్లు పడగొట్టాడు. మహమ్మద్ సిరాజ్ కు ఒక వికెట్ దక్కింది.


### గిల్ సెంచరీ మోత.. సుదర్శన్ సాత్.. ఈజీ ఛేజ్

215 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో గుజరాత్ టైటాన్స్ ఏ దశలోనూ తడబడలేదు. అద్భుతమైన ఫామ్ లో ఉన్న శుభ్ మన్ గిల్ ఆరంభం నుంచే రాజస్థాన్ బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. మైదానం నలుమూలలా బౌండరీల వర్షం కురిపిస్తూ కేవలం 53 బంతుల్లోనే 104 పరుగులు చేసి మ్యాచ్ ను ఒంటిచేత్తో లాగేసుకున్నాడు. అతడికి మిడిలార్డర్ బ్యాటర్ సాయి సుదర్శన్ అద్భుతమైన సహకారం అందించాడు. సుదర్శన్ 32 బంతుల్లో 58 పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. వీరిద్దరి విధ్వంసంతో గుజరాత్ విజయానికి చేరువ కాగా, చివర్లో రాహుల్ తెవాటియా కేవలం 9 బంతుల్లోనే 17 పరుగులు చేసి లాంఛనాన్ని పూర్తి చేశాడు. దీంతో గుజరాత్ మరో ఎనిమిది బంతులు మిగిలి ఉండగానే 18.4 ఓవర్లలో కేవలం మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి 219 పరుగులు సాధించి అద్భుత విజయాన్ని సొంతం చేసుకుంది. రాజస్థాన్ బౌలర్లలో నాండ్రే బర్గర్, బ్రిజేష్ శర్మ, జోఫ్రా ఆర్చర్ తలో వికెట్ తీసినా గుజరాత్ బ్యాటర్లను ఏమాత్రం కట్టడి చేయలేకపోయారు.

### ఆదివారం ఆర్సీబీతో తుది పోరు..

ఈ అద్భుత విజయంతో గుజరాత్ టైటాన్స్ సగర్వంగా ఫైనల్ కు చేరుకుంది. ఈ నెల 31 ఆదివారం అహ్మదాబాద్ వేదికగా జరగనున్న టైటిల్ పోరులో ఆర్సీబీ తో అమీతుమీ తేల్చుకోనుంది. ఫైనల్ మ్యాచ్ గుజరాత్ హోమ్ గ్రౌండ్ లో జరగనుండటం ఆ జట్టుకు మరింత కలిసి రానుంది. అటు అద్భుత ఫామ్ లో ఉన్న ఆర్సీబీ, ఇటు బలమైన గుజరాత్ టైటాన్స్ ఢీకొట్టనుండటంతో ఫైనల్ సమరంపై అభిమానుల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది.



# ఐపీఎల్ ఫైనల్‌కు కఠిన నిబంధనలు

**ముంబై, మే 29 :** ఐపీఎల్ 2026 గ్రాండ్ ఫైనల్‌కు కేవలం రెండు రోజుల సమయం మాత్రమే ఉండగా భారత క్రికెట్ నియంత్రణ మండలి కీలక నిర్ణయాలు తీసుకుంది. మ్యాచ్‌ల సమగ్రతను కాపాడడం, బుకీల ప్రలోభాలు మరియు అవినీతిని అడ్డుకోవడం లక్ష్యంగా యాంటీ కరప్షన్ విభాగం ఆటగాళ్లు, సపోర్ట్ స్టాఫ్‌పై కఠిన నిబంధనలు అమల్లోకి తెచ్చింది. ముఖ్యంగా స్మార్ట్ గాగుల్స్ వినియోగంపై పూర్తిస్థాయి నిషేధం విధించడం ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఫ్రాంచైజీలకు పంపిన అధికారిక సర్క్యులర్ ప్రకారం మ్యాచ్ సమయంలో ఆటగాళ్లు, డగౌట్‌లో ఉండే సిబ్బంది ఎవరూ స్మార్ట్ గాగుల్స్ ధరించకూడదని స్పష్టం చేసింది. ఈ గాగుల్స్‌లో ప్రత్యక్ష ప్రసారం, సందేశాల మార్పిడి, ఆడియో-వీడియో కాల్స్ వంటి సాంకేతిక సదుపాయాలు ఉండటంతో వాటిని కమ్యూనికేషన్ పరికరాలుగానే పరిగణిస్తున్నట్లు బీసీసీఐ తెలిపింది. దీంతో మ్యాచ్ రోజున మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లతో పాటు ఈ గాగుల్స్‌ను కూడా స్టేడియం భద్రతా సిబ్బందికి అప్పగించాల్సి ఉంటుంది. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఈ నిర్ణయానికి ఇటీవల చోటుచేసుకున్న ఘటనలు కూడా కారణమయ్యాయి. రాజస్థాన్ జట్టు మేనేజర్ రోమీ భిందర్ మ్యాచ్ జరుగుతుండగా డగౌట్‌లో మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ కెమెరాలకు చిక్కడంతో






బీసీసీఐ తీవ్రంగా స్పందించింది. యాంటీ కరప్షన్ నిబంధనలు ఉల్లంఘించినందుకు ఆయనకు లక్ష రూపాయల జరిమానా విధించడంతో పాటు హెచ్చరికలు జారీ చేసింది. ఈ ఘటన తర్వాతే టెక్నాలజీ దుర్వినియోగాన్ని అరికట్టేందుకు మరింత కఠిన చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఇక భద్రతా పరంగా కూడా బీసీసీఐ అప్రమత్తమైంది. ఐపీఎల్ సీజన్ సందర్భంగా 'హనీ ట్రాప్'లకు సంబంధించిన ఇంటెలిజెన్స్ సమాచారం రావడంతో ఆటగాళ్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసింది. ముందస్తు అనుమతి లేకుండా రాత్రి వేళల్లో హోటల్ బయటకు వెళ్లకూడదని సూచించింది. అలాగే ఆటగాళ్లు తమ గదుల్లోకి బాహ్య వ్యక్తులు లేదా అతిథులను అనుమతించకూడదని స్పష్టం చేసింది. ఈ చర్యలన్నీ ఫైనల్ మ్యాచ్‌కు ముందు భద్రత, పారదర్శకతను మరింత బలోపేతం చేయడానికేనని బీసీసీఐ వర్గాలు చెబుతున్నాయి.

